క్లుప్తంగా

రక్తదానం

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వైద్యంకోసం వచ్చిన ఓ నిండు గర్భిణికి అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో కడప నగరానికి చెందిన కమ్యూనికేషన్ పోలీసు ఆఫీసర్(సీపీఓ) షేక్ అబ్దుల్ రషీద్ మంగళవారం రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. గర్భిణికి రక్తం అవసరమని సంఘ సేవకులైన షేక్ చాంద్‌బాషా, లయన్ పటాన్ ఖాదర్‌బాషాలను కలిశారు. వారు స్పందించి కడప రెండవ పట్టణ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న సీపీఓ షేక్ అబ్దుల్ రషీద్‌కు తెలపడంతో ఆయన నగరంలోని మట్టి పెద్దపులి వద్ద ఉన్న రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సొసైటీ ద్వారా రక్తదానం చేశారు.

క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం ఇవ్వాలి

కడప వైఎస్సార్ సర్కిల్: జిల్లాలో క్లాప్ డ్రైవర్స్‌గా పనిచేస్తున్న వారికి రూ. 24,500 వేతనం ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి మనోహర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం విజయభాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రొద్దుటూరు, కడప కార్పొరేషన్‌లో క్లాప్ బండ్లు నడుస్తున్నాయని తెలిపారు. డ్రైవర్లకు అప్కో పరిధిలో ఇస్తున్న మాదిరిగా వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బుడగ జంగాలకు న్యాయం చేయాలని వినతి

కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్రంలోని బేడ బుడగ జంగాలకు న్యాయం చేయాలని జిల్లా నాయకులు దూపం రాజు కోరారు. మంగళవారం ఢిల్లీలోని లోక్‌నాయక్ భవన్‌లో షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్ సభ్యులు వడ్డెపల్లి రామచందర్‌కు ఏపీ బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం కమిటీ తరుపున వినతిపత్రాలను సమర్పించారు. వారు మాట్లాడుతూ బుడగ జంగం వారి రిజర్వేషన్ సమస్య కేంద్రంలో పెండింగ్‌లో ఉందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తమ నివేదికలను కేంద్రానికి పంపినా తగిన న్యాయం జరగలేదన్నారు. ఈ విషయంగా తమకు తగిన న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తాడికొండ నారాయణ, తూర్పాటి మనోహర్, కొండన్న, గిరిధర్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్సార్ సర్కిల్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి పేర్కొన్నారు. మంగళవారం ఈవిషయమై కడప తహసీల్దార్ లక్ష్మీనారాయణ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ, ఇంజినీరింగ్,బి-ఫార్మసీ వంటి ఉన్నత విద్యలో పెండింగ్‌లో ఉన్నటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ దాదాపుగా రూ. 3,480 కోట్లు పెండింగ్‌లో ఉందన్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి రాకముందు యువగళం పాదయాత్రలో సందర్భంగా అధికారం వస్తే నెలరోజుల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని చెప్పిన ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ వాటి గురించి మాట్లాడడం లేదన్నారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం పెండిగ్‌లో ఉన్న మొత్తం డబ్బు చెల్లించాలని విద్యార్థులకు ఒత్తిడి గురిచేస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మోహన్, హరి, శివ ఇతదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అంజుమన్ ఉర్దూశాఖ అడహాక్ నూతన కమిటీ



సత్తార్ సాహిర్



హిదాయతుల్లా

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర అంజుమన్ తరక్కి ఉర్దూశాఖ అడహాక్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు సత్తార్‌ఫైజీ తెలిపారు. మంగళవారం కడప క్రిసెంట్ హైస్కూల్లో అడహాక్ కమిటీ ఎన్నికలను నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర అధ్యక్షుడిగా సత్తార్ సాహిర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హిదయతుల్లా, ఉపాధ్యక్షులుగా మౌల్వి ముతిపూర్ రెహమాన్, మహ్మద్ మహబూబ్, ఉప కార్యదర్శులుగా మహమ్మద్ యునస్, హిదాయతుల్లా ఫవామి, కోశాధికారిగా అబ్దుల్‌ఘనిలతో పాటు కార్యవర్గ సభ్యులుగా మరో 15 మంది ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉర్దూ భాషాభివృద్ధికి, ఉర్దూ ఉపాధ్యాయుల, పాఠశాలల, పాఠ్యపుస్తకాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు అమీర్ బాబు, నజీర్ అహ్మద్, జిలానీబాషా, సలావుద్దీన్ పలువురు ఉర్దూ కవులు, రచయితలు పాల్గొన్నారు.

కేసీ ఇలా.. నీరు సాగేదెలా..!

- పిచ్చిమొక్కలు, తీగెలతో నిండిన కేసీ ప్రధాన కాలువ
- ఆదినిమ్మాయపల్లె నుంచి దేవుని కడపకు వరకు అదే పరిస్థితి
- ఆలంఖానపల్లి వద్ద డ్రైనేజీ వాటర్‌ను కేసీ కాలువలోకి మళ్లింపు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



ఆలంఖాన్‌పల్లె సమీపంలో ప్రధాన కాలువలో నిండిన పిచ్చిమొక్కలు

కడప అగ్రికల్చర్: పెన్నానదికి అనుసంధానంగా ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట నుంచి క్రిష్టాపురం వరకు కేసీ కెనాల్ ప్రధాన కాలువను ఏర్పాటు చేశారు. క్రిష్టాపురం అక్కడి నుంచి పాత కడప వరకు ఉప కాలువను ఏర్పాటు చేశారు. ఈ ఉపకాలువ ద్వారా పలు గ్రామాలకు నీరు వెళ్లటమే కాకుండా పాత కడప చెరువుకు కూడా కేసీ నీరు వెళ్లుతుంది. ఈ కెనాల్ పరిధిలో వల్లూరు, చెన్నూరు, కడప, సికెదిన్నె మండలాలకు సంబంధించి 12776 ఎకరాల అయకట్టు ఉంది. ఇందులో ప్రధానంగా కడప మండల పరిధిలో 5230 ఎకరాల ఆయకట్టు ఉంది. కడప మండల పరిధిలో సాగునీరు అందే కాలువలో నిత్యం మురుగు, మరుగుదొడ్ల నీరంతా కలుషితమైతుంది. దీనికి తోడు ఆలంఖాన్‌పల్లి ఇర్కాన్ సర్కిల్ నుంచి పాత కడపుకు వెళ్లే ప్రధాన కాలువతోపాటు సబ్ కాలువలన్నీ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు, తీగలు కాలువలో అల్లుకుని ఉన్నాయి. దీంతో నీటి ప్రవాహం ముందుకు సాగడం చాలా కష్టంగా ఉంటుంది. ఆదినిమ్మాయపల్లె నుంచి క్రిష్టాపురం వరకు ఉన్న ప్రధాన కాలువలో కూడా ఇదే పరిస్థితి. కాలువలో ఉన్న చెట్లు, చెదారం, పిచ్చిమొక్కలంతా పేరుకుని పోయాయి. దాని గురించి పట్టించుకునే నాథుడే లేదని పలువరు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ దుస్థితి ఈ ఏడాదిది కాదని ఏళ్లతరబడి ఇదే పరిస్థితి నెలకొని ఉందని రైతులు తెలిపారు. నగరంలోని పాత కడపకు వెళ్లే కాలువలో కూడా ఇళ్లలో చెత్తాచెదారమంతా పేరుకపోయింది. దీంతో నీటి ప్రవాహం స్పీడుగా ముందుకు సాగడం లేదని పలువురు రైతులు తెలిపారు.

కేసి పరిధిలో వచ్చే గ్రామాలు, ఆయకట్టు వివరాలు

ఆదినిమ్మాయపల్లి కేసీ కెనాల్

ఆయకట్టు మొత్తం	: 12776 ఎకరాలు
వల్లూరు మండలంలో ఆయకట్టు	: 255
చెన్నూరు మండలంలో ఆయకట్టు	: 7176
కడప మండలంలో ఆయకట్టు	: 5230
సికెదిన్నె మండలంలో ఆయకట్టు	: 115

పలు చోట్ల దెబ్బతిన్న కల్వర్టులు

కేసీ కాలువకు సంబంధించి ప్రధాన కాలువ నుంచి సబ్ కాలువలకు నీరు పొయేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్ కల్వర్టులు కూడా పలు చోట్ల దెబ్బతిని కుంగిపోయినట్లు రైతులు చెబుతున్నారు. దీంతో ఆ దారి వెంబటి పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కేసీ కాలువలో అల్లుకున్న పిచ్చిమొక్కలను తొలగించడంతోపాటు దెబ్బతిన్న కల్వర్టులకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

నీటి ప్రవాహానికి అంతరాయం



కేసీ కాలువలో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారమంతా ఏళ్లతరబడి పేరుకుని ఉంది. దీంతో నీటి ప్రవాహానికి బాగా అంతరాయం ఏర్పడుతుంది. కాలువలో ఈవన్నీ అడ్డించి లేకుండాపోతే పాత కడపు చెరువుకు నీరొస్తుంది. పంటలను సాగు చేసుకునేందుకు వీలవుతుంది.

– మునిరెడ్డి, రైతు, పాతకడప

నీరు కలుషితం అవుతోంది



కేసీ కాలువలో పలు చోట్లు డ్రైనేజీ వాటర్ కలుస్తోంది. మరికొన్ని చోట్లు మరుగుదొడ్ల పైపులు కూడా కేసీలోకే పెట్టారు. కేసీ నీరంతా కలుషితమవుతోంది. ఈ నీటిని పంట పొలాలకు పెట్టాలంటే ఒకింత ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి డ్రైనేజీ వాటర్ కలవకుండా చర్యలు తీసుకోవాలి.

– అమర్‌నాథరెడ్డి, రైతు, ఆలంఖాన్‌పల్లి

చెత్తా చెదారం పెరుకుపోయింది



కేసీ కాలువలో భాగంగా పాత కడపకు వచ్చే సబ్ కాలువలో పలు చోట్ల చెత్తాచెదారమంతా పేరుకపోయింది. దీనికి తోడు నగరంలో పలు చోట్ల వ్యర్థాలు, చెత్తను కాలువలోనే పడేస్తున్నారు. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఈశ్వరరెడ్డి, రైతు, కడప

చర్మవ్యాధులపై అవగాహన



సోరియాసిస్ చికిత్సపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కడప అర్బన్: ప్రపంచ సోరియాసిస్ దినోత్సవం సందర్భంగా మంగళవారం కడప సర్వజన ఆసుపత్రి రిమ్స్ చర్మ వ్యాధుల విభాగంలో రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డెర్మటాలజీ హెచ్ఓడీ డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ ప్రారంభ దశలోనే సోరియాసిస్ వ్యాధికి చికిత్స చేయించుకోవాలన్నారు. ఫువా థెరఫీ వంటి ఖరీదైన చికిత్సలు అందుబాటులోకి తెచ్చిన రిమ్స్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సదుపాయం రోగులకు ఎంతో ఉపయోగకరంగా వుంటుందన్నారు. కార్యక్రమంలో కడప ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, చర్మవాధ్యుల విభాగం వైద్య అధ్యాపకులు, పీజీ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, నర్సింగ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వంపై పోరాటం



మాట్లాడుతున్న ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య

కడప రూరల్ : ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ అమలు బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎస్సీ వర్గీకరణను చేపట్టి మాదిగ వర్గాలకు న్యాయం చేయాలన్నారు. ఆ మేరకు నవంబరు 5వ తేదీన విజయవాడలో దక్షిణాది రాష్ట్రాల జాతీయ మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు, రిజర్వేషన్ పెంపుదల అంశాలకు సంబంధించి ప్రధాన అజెండా ఉంటుందన్నారు. ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబులేశు, అధికార ప్రతినిధి రమణ, రామయ్య,రెడ్డిబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఉక్కు పరిశ్రమను నిర్మించాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాము

కడప వైఎస్సార్ సర్కిల్: రాష్ట్ర విభజన చట్టంలో తెలిపిన విధంగా జిల్లాలో ఉక్కు పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాము డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల డీవైఎఫ్ఐ ×రాష్ట్ర కమిటీ సమావేశాల్ల సందర్భంగా, మొదటి రోజున ×రాష్ట్ర పునర్విభజన చట్టం 2014 అమలు – పాలకుల పనితీర్లు అనే అంశంపై ×సెమినార్ల్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గడిచిన 15 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీ ×ప్రత్యేక హోదా హామీ మాట మరచి పరిపాలిస్తుందని విమర్శించారు. కడప ఉక్కు కర్మాగారం కోసం నాలుగు సార్లు శంకుస్థాపనలు చేసినా నిర్మాణ పనులు మొదలు పెట్టలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే కడప ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ఉక్కు గనుల శాఖ సేల్ ఆధ్వర్యంలో నిర్మించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు రామన్న, వీరణాల శివకుమార్, ఎం.చిన్ని, రాష్ట్ర కమిటీ సభ్యులు హర్ష, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు డేవిడ్, తులసి, నరసింహులు, ఆంజనేయులు, సురేంద్ర పాల్గొన్నారు.

బాణా సంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలి

కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప అర్బన్: దీపావళి పండుగ సందర్భంగా కడప నగరంలోని మున్సిపల్ గ్రౌండ్ ఆవరణంలో బాణాసంచా వ్యాపారులు నిబంధనలను పాటించాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, టూటౌన్ సీఐ బి. నాగార్జున సూచించారు. మంగళవారం సాయంత్రం కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో బాణా సంచా వ్యాపారులతో జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పోలీసులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తప్పక పాటించాలన్నారు. అగ్నిప్రమాదాన్ని నివారించే సాధనాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అగ్నిప్రమాదానికి కారణమైన వస్తువులను నిషేధించాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. కడప టూటౌన్ ఎస్ఐ ఎస్‌కెఎం హుసేన్, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకోవాలి

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో పరీక్ష ఫీజుల పేరుతో ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ విషయమై ఇంటర్ ఆర్ఐఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. కడప నగరంలోపాటు బద్వేల్, జమ్మలమడుగు, మైదుకూరు, పులివెందుల ప్రాంతాల్లో ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఫిజులు చెల్లించినా ఎటువంటి రశీదులు ఇవ్వడం లేదన్నారు. అధికారులు స్పందించి వెంటనే సంబంధిత కళాశాలలపై విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తానా సదస్సుకు ఆహ్వానం



చింతకుంట శివారెడ్డి

కడప కల్చరల్ : ఉత్తర అమెరికా తెలుగుసంఘం (తానా) వారి 'నెల నెలా తెలుగు వెలుగు' కార్యక్రమంలో పాల్గొనాలని కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డికి ఆహ్వానం అందింది. ఇందులో భాగంగా ఆయన ।ప్రాంతీయ మాండలిక భాషా సాహిత్యాల అస్తిత్వం॥ గురించి అంతర్జాల సదస్సులో ప్రసంగించనున్నారు. నవంబరు 24న జరగనున్న ఈ కార్యక్రమంలో రాయలసీమ యాస గురించి ఆయన ప్రసంగిస్తారు. కార్యక్రమాన్ని తానా పూర్వాధ్యక్షులు డా.తోటకూర ప్రసాద్ నిర్వహించనున్నారు. తానా సదస్సుకు ఆహ్వానం అందుకున్న డాక్టర్ చింతకుంట శివారెడ్డిని వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, సిబ్బంది అభినందించారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప కార్పొరేషన్ : కార్మికుల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కేసీ బాదుల్లా, నగర అధ్యక్ష, కార్యదర్శి నరసింహులు, తారక రామారావులు తెలిపారు. మంగళవారం స్థానిక కడప నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ గోడ పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రమకు తగ్గ వేతనం, పని భద్రత, కార్మికుల హక్కులు కోసం అనేక పోరాటాలు చేసి సాధించిన గొప్ప చరిత్ర కలిగిన సంఘం అన్నారు. స్కీం వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26వేలు రూ ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రవేటికరణ ఆపాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాశి,రాజులు పాల్గొన్నారు.

పక్షవాతానికి ఆధునిక వైద్యం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి

కడప రూరల్ : పక్షవాతానికి ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని న్యూరో సర్జన్ డాక్టర్ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. వరల్డ్ స్ట్రోక్‌డే సందర్భంగా మంగళవారం స్థానిక జగదీష్ న్యూరో కేర్ ఆస్పత్రిలో పక్షవాతంపై అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పక్షవాతానికి సత్వర వైద్య సేవలు పొంది దీర్ఘకాలిక వైకల్యాన్ని జయించాలన్నారు. పక్షవాతానికి నిశ్చల జీవనశైలే కారణమన్న విషయాన్ని గుర్తిస్తూ ప్రతి ఒక్కరూ ప్రశాంతయుత జీవనం గడిపేందుకు కృషి చేయాలన్నారు. అదుపులో లేని మధుమేహం, రక్తపోటు ఇతర దురలవాట్లు పక్షవాతానికి ప్రధాన కారణాలన్నారు. స్ట్రోక్‌కు గురైన నాలుగున్నర గంటల్లోపు చికిత్స చేస్తే వైకల్యం రాకుండా చూడవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ బీపీ అదుపులో పెట్టుకోవాలన్నారు.

కెనరా బ్యాంకు సేవలు ప్రశంసనీయం

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్



కెనరా బ్యాంకు అధికారులతో ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. మంగళవారం కెనరాబ్యాంకు ఆర్ఎం మురళీ మోహన్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ లెవెల్ ఆర్‌సిటి అడ్వయిజర్ కమిటీ నిర్వహించారు. తొలుత సంస్థ అందిస్తున్న సేవలను బ్యాంకు ఆర్ఎం మురళీమోహన్ ఇన్‌చార్జి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం అదితి సింగ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను ఆరా తీశారు. ఈనెల 20 నుంచి మహిళలకు సంబంధించి దుస్తుల తయారీ, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, ఎంబ్రాయిడరీ, జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణను ప్రారంభించామన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన ప్రతి ఒక్కరికీ ట్రైనింగ్ మెటీరియల్‌తోపాటు వసతి, భోజన సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీసీఎం జనార్దన్, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, నాబార్డు డీజీఎం విజయ్ విహారి, పరిశ్రమలశాఖ జీఎం చాంద్‌బాష, ఆర్‌సిటీ డైరెక్టర్ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపనిషత్తుల సారమే భాగవతం



మాట్లాడుతున్న ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి

కడప కల్చరల్ : శ్రీమద్ భాగవతం ఉపనిషత్తుల సారమేనని మానవాళికి సాక్షాత్ భగవంతుడు ప్రసాదించిన వరమని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. మంగళవారం పాత కడప హిందూ ధర్మ సమాజ సంస్థ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ వ్యాసుని అష్టాదశ పురాణాల్లో భాగవతం విశిష్టమైందని, దీన్ని ఆంధ్రుల పుణ్యమా అన్నట్టు పోతన తేనెలొలికే పదాలతో మనకు అందించారని, ఇది భక్తి తత్వాన్ని, భగవతత్వాన్ని ఆవిష్కరించిందన్నారు. సభాధ్యక్షులు కాల్వ అర్జున్ రెడ్డి మాట్లాడుతూ భాగవతం చదివితే మనిషి బాగుపడతాడన్నారు. కవి మామిళ్ళ లోకనాథం ప్రసంగిస్తూ ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించే వారికి భాగవతం కరదీపిక అన్నారు. బీరం లక్ష్మిరెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, ఏపీఎస్ రాజు, ఎలిశెట్టి గోపాల్,గునిశెట్టి శ్రీనివాసులు, దిలీప్ జైన్ కూడా మాట్లాడారు. కార్యక్రమాన్ని సంస్థ చైర్మన్ సోమ కళానాథరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం కళాకారులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.

మాదక ద్రవ్యాలు ప్రాణాంతకం



సర్టిపికెట్లు అందుకున్న విద్యార్థులతో అతిథులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మత్తు మాదక ద్రవ్యాలు తీసుకోవడం ప్రాణాంతకం అని నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి మణికంఠ, రిమ్స్ సైక్రియాటిస్ట్ డాక్టర్ వెంకట రాముడులు తెలిపారు. మంగళవారం కడప నగరం అక్కాయపల్లె నిర్మల ఫార్మసీ కళాశాలలో జేబీవీఎస్ ది ప్రిజర్వెర్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరదాగా మొదలయ్యే మత్తు, మాదక ద్రవ్యాల వాడకం క్రమం క్రమంగా పెరుగుతుందన్నారు. ఈ అలవాటు పెరగడంతో ఎన్నో అఘాయిత్యాలు జరుగుతాయని, వాటి వల్ల జరిగే నష్టాలపై అవగాహన కలిగి ఉండి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఫార్మ్ హెచ్ఓడీ శ్రీధర్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలు వాడడం వల్ల విలువైన జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు అతిథులు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హెచ్ఓడి నరేష్, జేబీవీఎస్ సేవా సమితి వ్యవస్థాపకులు అశోక్, మదర్ థెరిసా ఫౌండేషన్ చైర్మన్ జుటూరు విజయ్, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సురేంద్రబాబు

కడప రూరల్ : చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సురేంద్రబాబు తెలిపారు. తన పుట్టిన రోజు సందర్భంగా స్థానిక తిరుమల ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.శిబిరానికి హాజరైన రోగులకు పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈఎన్‌టీ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏదైనా సమస్య వచ్చినపుడు తక్షణమే వైద్యులను సంప్రదించాలని సూచించారు. రాబోయేది చలికాలం కావడంతో వృద్ధులు, పిల్లలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఏఓ తేజ పాల్గొన్నారు.

డిజిటల్ లిటరసీ తప్పనిసరి



మాట్లాడుతున్న జేష్టాది వసంత్

కడప ఎడ్యుకేషన్: ప్రస్తుత సాంకేతిక సమాజంలో డిజిటల్ లిటరసీ ప్రతి వ్యక్తికి తప్పనిసరి అని నిర్మాన్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జేష్టాది వసంత్ అన్నారు. మంగళవారం కడపలోని చిన్నచౌకు బాలికల ఉన్నత పాఠశాలలో నాస్కం సపోర్టుతో నిర్మాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డిటజిల్ లిటరసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ లిటరసీ అనేది కేవలం కంప్యూటర్ లేదా ఇంటర్నెట్ వాడకం మాత్రమే కాదన్నారు. ఇది సమాచారాన్ని సృష్టించడం, వ్యవహరించడం , ప్రాసెస్ చేయడం వంటి సామర్థ్యాలను కూడా చొప్పించడం జరుగుతుందన్నారు. డిజిటల్ సాంకేతిక ప్రాధాన్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, నిర్మాన్ సంస్థ సభ్యులు చిన్న గురవయ్య, సురేఖ పాల్గొన్నారు.

వైవీయూలో అధ్యాపకులకు నూతన బాధ్యతలు



నియామక పత్రాలను అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ: యోగివేమనన యూనివర్సిటీ పబ్లిక్ రిలేషన్ సెల్ డైరెక్టర్‌గా డాక్టర్ పి. సరిత నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం విశ్వవిద్యాలయంలోని వీసీ చాంబర్‌లో వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మలు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈమె డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అలాగే పరీక్షల విభాగ చీఫ్ సూపరింటెండెంట్‌గా ఆచార్య కాత్యాయిని నియమితులయ్యారు. ఆమెకు నియామకపు పత్రాన్ని వీసీ, రిజిస్ట్రార్‌లు అందజేశారు. ఇదివరకు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వైవీయూ ఆంగ్ల విభాగం ప్రొఫెసర్ పి.పద్మ స్థానంలో ఈమెకు బాధ్యతలు అప్పజెప్పారు.

చిత్రలేఖన పోటీలను జయప్రదం చేయాలి

కడప ఎడ్యుకేషన్: కడప బాలోత్సవం ఆధ్వర్యంలో నవంబర్, డిసెంబర్‌లో నిర్వహించనున్న చిత్రలేఖనం పోటీలను జయప్రదం చేయాలని బాలోత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు గుర్రం గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీయటానికి ఉమ్మడి జిల్లాలో పులివెందుల, పొద్దుటూరు, బద్వేలు, రాజంపేట, రాయచోటిలలో నిర్వహించ తలపెట్టినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో ఆసక్తి కలిగిన డ్రాయింగ్ మాస్టర్స్, ఆర్టిస్టులు పాల్గొని చిత్రాలేఖనం పోటీలు జయప్రదం చేయడం కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీరాజా, నాగమునిరెడ్డి, ఏలేశ్వరావులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విదానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.